



'చిన్నపిల్లాడు మారాం చేస్తే మందలించాల్సిందిపోయి తనలా చేసేదేంటి?' ప్రసాదరావు తన్నుతనే అలా అనుకోవడం అది పదోసారి!

నిముష నిముషానికీ అతన్లో భయం పెరిగిపోతోంది!

బుజ్జి ఒక్కగానొక్క ముద్దులకొడుకు. వాడేం అడిగినా తను కాదన్లేదు. కోరడమే ఆలస్యం నిముషాలమీద వాడి కోరిక తీరిపోవలసిందే!

ఇంతకు ముందెన్నోసార్లు రకరకాల బొమ్మల్ని షాపుల్లోను, స్నేహితుల దగ్గర చూసి వెంటనే తనకి అటువంటి బొమ్మలు కావాలని మారాం చేశాడు. మరుక్షణంలో వాటిని తెచ్చిచ్చేవాడు తను.

వయసుతో పాటు కోరికలూ మారాయ్ క్రమంగా బొమ్మల మీద నించి ఆటల మీదకి మళ్ళింది వాడి దృష్టి.

క్రికెట్ బాట్, టెన్నిస్ రాకెట్, కారంబోర్డ్— బుజ్జి ఏదడిగినా ఏమాత్రం సందేహించలేదు కొనివ్వడానికి. కానీ మొట్టమొదటిసారిగా పొద్దున వాడి కోరికను కాదన్నాడు!

వాడు మొహం ముడుచుకుని వెళ్ళిపోయాడు. తన మనసెంతో బాధపడిపోయింది అయినా తమాయించుకున్నాడు.

అదేంటో కానీ వినిపించుకోలేదు. "నాన్నా! నాకు పతంగి కొనిపెట్టవా?" అంటూ వాడు తను ఆఫీసుకి బయల్దేరేటప్పుడు ఆప్యాయంగా దగ్గరకొచ్చి అడిగేసరికి కాదనలేకపోయాడు. పైకలాగైతే వాడికిచ్చాడే గాని— మనసు పీకుతూనే వుంది— పతంగి నెగురవేసే మోజులో వాడే అపాయానికి గురవుతాడోనని!

దానికి తగ్గట్టుగా ఆఫీస్‌లోకి అడుగుపెట్టగానే భుజంగరావు అంటున్న మాటలు అతడ్ని మరింత కంగారు పెట్టాయి.

"మా పక్కింటివాళ్ళ కుర్రాడు నిన్న సాయంత్రం స్కూల్నించి వచ్చి డాబా ఎక్కి పతంగి నెగరేస్తున్నాడు. అది పైకి పోతున్నకొద్దీ వాడి ఆనందం పెరిగిపోతోంది. హఠాత్తుగా దారం మధ్యలో తెగిపోయింది. తెగిపోయిన పతంగిని అందుకొని పట్టుకోవాలని ధ్యాసలో వాడు మిద్దె చివరికి చేరిందికూడా గమనించలేదు. కింద నిలబడున్న మేం అరుస్తూనే వున్నాం.. ఊం... వాడు ఆ ధ్యాసలో వుంటేగా? మరుక్షణంలో కింద రక్తపు మడుగు మధ్య పడున్నాడు. ఈ పతంగుల్తో... ఏమో..." సీట్లో కూర్చున్న తర్వాత కూడా భుజంగరావు మాటలే ప్రసాదరావు మనసులో గింగురు పెట్టసాగాయ్.

'తన డాబా పిట్టగోడ కాస్త ఎత్తుగానే వుంటుంది. బుజ్జి మేడమీద పతంగి నెగురవేసుకున్నా పరేదు!' తనకి తనే ధైర్యం చెప్పుకున్నాడు.

అయినా ఈ పతంగి నెగురవేయడంలో అతనే ప్రమాదానికి గురవుతాడోనని ప్రసాదరావు మనసు పీకుతూనే వుంది.

'తను పతంగి కొనుక్కోవడానికి బుజ్జికి పైసలివ్వకుండా వుంటే బావుండేది' మరోసారి తనని తనే అనుకున్నాడు.

ఇంకెప్పుడూ అలా చెయ్యకూడదని ఇంటికి వెళ్ళగానే వాడి చేతిలోంచి పతంగి లాక్కుని ముక్కలు ముక్కలుగా చింపెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

"ప్రసాదరావుగారూ! ఏంటీ అంతగా ఆలోచిస్తున్నారు — మీ టేబిల్ మీది పేపర్లు ఎగిరిపోతున్నది కూడా గమనించకుండా?' భుజంగరావు మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు ప్రసాదరావు.

ఎదురుగావున్న టేబుల్‌మీది ఫైల్లోంచి ఎగిరిన కాగితం భుజంగరావు కాళ్ళ దగ్గర

బైలి నడిచింది. దాన్నందుకోవాలని సీట్లోంచి లేచి గబగబ ముందుకెళ్ళాడు ప్రసాదరావు.

సరిగ్గా అతను దాన్నందిపుచ్చుకోబోయే సరికి ఫాన్ గాలికి ఆ కాగితం మరికొద్ది ముందుకు జరిగింది. వెంటనే అది తెగిన పతంగిలా కనిపించింది ప్రసాదరావుకి...

మరు క్షణంలో అతని ఆలోచన్లు బుజ్జి వేపు పరుగెత్తాయి —

పతంగిని వాడెక్కడ ఎగరేస్తున్నాడో! మేడమీద అయితే పర్లేదు రోడ్డుమీదయితే? అమ్మో! ఎప్పుడూ లారీలు, బస్సులతో ఆ రోడ్డు హడావిడిగా ఉంటుంది. వాడు పతంగి ధ్యాసలో రోడ్డు కడ్డంగా పరుగులెడితే... అమ్మో...

—వణికే గుండెతో ఆ కాగితాన్నందిపుచ్చుకుని తిరిగొచ్చి సీట్లో కూలబడ్డాడు. అతని ఆలోచనలు మాత్రం పతంగిని ఎగరేసే బుజ్జి చుట్టూనే తిరగసాగాయ్

ఆదివారం స్కూల్‌కి శెలవు రాకుండా వుంటే బావుండేది. అప్పుడు వాడి దృష్టి పతంగుల వేపుకి వెళ్ళేదే కాదు— తనకీ టెన్షన్ వుండేదీ కాదు!

"బాబూ! మీకు టెలిఫోన్ వచ్చింది." ప్యూన్ మాటలతో త్రుళ్ళిపడ్డాడు ప్రసాదరావు. తనకిఫోనా? కొంపదీసి ఇంటిదగ్గర్నించి కాదు కదా? బుజ్జికేమైనా అయితే తను బ్రతగ్గలడా?

—ఒక్క అంగలో ఆఫీసర్ గదిలోవున్న ఫోన్ దగ్గరకు చేరుకున్నాడు. అప్పటికే అతని మొహమంతా చెమటతో తడిసిపోయింది. వణికే చేతులనైతే అదుపులో పెట్టగలిగాడుగాని, గొంతును అదుపులో పెట్టలేక పోయాడు.

"హలో..." తన గొంతు తనకే విచిత్రంగా అనిపించింది ప్రసాదరావుకి.

"నేన్రా శివాజీని. ఆఫీస్ పనిమీద ఇవాళే వచ్చానిక్కడికి. ఆఫీసైపోగానే బుద్ధిగా సరాసరి ఇంటికే వచ్చెయ్. నేనూ ఆ టయానికి మీ ఇంటికి చేరుకుంటాను! మిగతా విషయాలు ముఖాముఖీ..." ఫోన్ పెట్టేశాడు. తన అనుమానాన్ని చిన్నాభిన్నం చేస్తూ వినిపించిన మిత్రుడి గొంతు అతని కెంతో ఆనందాన్నిచ్చింది.

రుమాలుతో మొహాన్ని తుడుచుకున్నాడు.

"వాట్ ప్రసాదరావ్? వాట్ హాపెండ్? ఏందుకలా వున్నారు?" అంతవరకూ అతన్నే గమనిస్తున్న ఆఫీసర్ అలా అడిగేసరికి తిరిగి కంగారు పడిపోయాడు ప్రసాదరావ్.

అంత కంగారులోనూ అతనికో మహత్తరమైన ఆలోచన వచ్చింది.

తనెలాగూ ఈ టెన్షన్లో ఇవాళ పని చేయలేడు. ఇంటికి వెళ్ళి బుజ్జిగాడ్ని చూస్తేకాని మనసు నిలకడ కాదు. తక్షణం ఇంటికి వెళిపోవాలంటే ఏదో ఒకటి బొంకేయాలి.

"మా మదర్‌కి వంట్లో బావుండలేదట సార్..." ఎప్పుడో చనిపోయిన అమ్మమీద పెట్టి బొంకేశాడు.

"అరె...! అయితే వెళ్ళిపొండి..." ఆఫీసర్ నోట్లోంచి ఆ మాట రావడమే ఆలస్యం, పరుగులాంటి నడకతో సీట్‌ని చేరుకున్నాడు ప్రసాదరావ్. మరు క్షణంలో అతని సైకిలు ఝామ్మంటూ ఆఫీస్ ఆవరణ దాటేసింది.

ఇంటికి వెళ్ళంగానే సరాసరి బుజ్జిగాడి దగ్గరకు వెళిపోవాలి. వాడి చేతిలోంచి పతంగిని లాక్కుని ముక్కలు ముక్కలు చేసేయాలి. ఇంకెప్పుడూ ఏంతేడ్చినా పతంగిని కొనివ్వకూడదు - కాళ్ళు ప్రయత్నంగా సైకిల్ని తొక్కుతున్నా అతని ఆలోచన్లు బుజ్జి, పతంగుల చుట్టూనే తిరగసాగాయ్.

టర్నింగ్ తిరిగాడు

ఎదురుగా పెద్ద గుంపు!

రోడ్డు బ్లాక్ అయిపోయింది—

చటుక్కున సైకిలు దిగాడు.

"పాపం! ఎవరో కుర్రాడు పతంగి నెగరేస్తూ రోడ్డు కడ్డంగా వచ్చాడు. బస్ బ్రేక్ వేశాడు. కాని అప్పటికే ముందు రెండుచక్రాలూ అతనిమీద కెక్కేసాయ్..." చుట్టూవున్న గుంపులోంచి బయటికొస్తూ అన్నారెవరో.

ప్రసాదరావు గుండె ఝల్లుమంది.

సైకిల్నలానే వదిలేసి, జనాన్ని తోసుకుంటూ మధ్యకి చేరుకున్నాడు.

రక్తపు మడుగులో నిర్జీవంగా పడున్నాడు కుర్రాడు! బుజ్జి వయసువాడే కాని బుజ్జి కాదు! అతని గుండె దడ తగ్గింది.

ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడబుద్ధి పుట్టలేదు. వెంటనే ఇవతలికి వచ్చి, సైకిలెక్కాడు.

"వెధవరోజు...! ఎక్కడికి పోయినా అన్నీ దుశ్శకునాలే!" సైకిల్ని మరింత స్పీడుగా తొక్కసాగాడు. 'ఎంత త్వరగా ఇంటికి చేరుకుంటానా' అని అతని మనసు పరుగెత్తసాగింది. దానితో సమానంగా సైకిల్ని పరిగెత్తించాలని కాళ్ళు దబగబా తొక్కసాగయ్...

స్పీడ్‌లో టర్నింగ్ తిరిగేసరికి ముందు టైర్ స్కిప్పయింది. కింద పడిపోయాడు.

తను, తనమీద సైకిల్!

లేవబోతున్న అతని కంటికెదురుగా సర్రున దూసుకొస్తున్న లారీ—

భయం...

లేవలేక పోయాడు.

కర్ ర్... మోతతో అతని మీదనించి ముందుకెళ్ళి నిలబడి పోయింది లారీ...

సెకండ్లలో జనం పోగయ్యారు.

చితికిపోయిన తలతో, రక్తపుమడుగులో వున్న ఆ శవం ఎవరిదో కూడా ఎవరూ గుర్తుపట్టలేక పోతున్నారు!

సరిగ్గా అదే సమయంలో తమ డాబా మీద నిలబడి పతంగి నెగరవేసుకుంటున్న బుజ్జి మనసు ఆనందంతో ఆ పతంగికన్నా ఎత్తున ఎగురుతోంది!

